## తుంగతుర్తిలో ఏసీబీ సోదాలు



**టీ మీడియా జూన్ 3 ,తుంగతుర్తి:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో హైదరాబాదులో ఇటీవల ఫోన్ టాపింగ్ కేసులో ప్రధాన నిందితులై, అక్రమాస్తులతో సస్పెన్షన్ లో ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు రాష్ట్ర ఏసీబీ అధికారుల ఆదేశాల మేరకు మామ రిటైర్డ్ పోలీస్ అధికారి దుగ్యాల రాజేశ్వరరావు ఇంట్లో బుధవారం ఏసీబీ అధికారుల సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం ఇంటిలో ఎవరు లేరని, తాళం వేసి ఉండడంతో, దీనితో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేకపోయామని, తదుపరి విచారణ జరగనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.


నిజం మా లక్ష్యం.. ప్రజలే మా శక్తి..
TMEDIA
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 139
సంచిక : 251
పేజీలు : 4

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం, జూన్ 04, 2026


# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే భవిష్యత్‌కు భరోసా
- మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల



**టీ మీడియా, జూన్ 3, ఖమ్మం:** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు.జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు.తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశం లోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు.

రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ

## గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**టీ మీడియా, జూన్ 3 ,భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామాలు, వార్డుల స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టడం లక్ష్యంగా గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాల పరిధిలోని గ్రామాలను నాలుగు క్లస్టర్లుగా, మున్సిపాలిటీల పరిధిలోని వార్డులను కూడా క్లస్టర్లుగా విభజించి ప్రణాళికాబద్ధంగా సభలను నిర్వహించాలని సూచించారు.గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజలకు వానాకాల సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణ, అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, చెరువులు మరియు జల వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కల నాటకం మరియు సంరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, వార్డులో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి విధానం, ఎరువుల సమతుల వినియోగం, ఫార్మా రిజిస్ట్రేషన్, వానాకాల సాగుకు సంబంధించిన సూచనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా జనగణన కార్యక్రమం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలని అన్నారు .విద్యుత్, నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సేవలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ, వార్డు సభల్లో విస్తృతంగా వివరించాలని ఆదేశించారు. ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ముందస్తుగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.గ్రామ, వార్డు సభలకు ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, సభల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గ్రామ, వార్డు సభలను సమర్థవంతమైన వేదికలుగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

# బ్యాక్‌వాటర్‌తో భద్రాచలం, పినపాకలకు ముప్పు

### పోలవరంఅథారిటీ బృందానికి బీఆర్ఎస్ నేతల వినతి

**టీ మీడియా జూన్ 3 ,బూర్గంపహాడ్ :** పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం, పినపాక నియోజకవర్గం ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, 86 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం సంభవిస్తే పోలవరం బ్యాక్ వాటర్‌తో ఆయా ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజల ప్రాణాలు, ఆస్తులు, వ్యవసాయ భూములు, ప్రభుత్వ, జాతీయ ప్రాధాన్యత సంస్థలకు తీవ్రనష్టం ఏర్పడే అవకాశం ఉందని బీఆర్ఎస్ బూర్గంపహాడ్, అశ్వాపురం నేతలు అన్నారు. ఈ మేరకు బుధవారం సారపాక ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్న పోలవరం అథారిటీ బృందాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నాయకులు కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు 12 అంశాలతో కూడిన లేఖను వారికి అందించి ఆ లేఖలోని ప్రధాన డిమాండ్లను తెలంగాణ ప్రజల హక్కులు, భద్రత, భవిష్యత్తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమలు చేయాలని కోరారు. ప్రధానంగా సమగ్ర బ్యాక్ వాటర్ అధ్యయనాన్ని తక్షణం నిర్వహించాలని, 36 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరద ప్రవాహాన్ని ప్రామాణికంగా తీసుకుని స్వతంత్ర జాతీయ లేదా అంతర్జాతీయ నిపుణ సంస్థలతో కొత్త బ్యాక్ వాటర్ అధ్యయనం నిర్వహించి ఆ అధ్యయన నివేదిక పారదర్శకతతో ప్రజల ముందుంచాలన్నారు.తెలంగాణ ముంపు గ్రామాలకు ప్రత్యేక



ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని, ప్రతి ముంపు బాధిత కుటుంబానికి ఏపీలో అమలవుతున్న ప్యాకేజీతో సమానంగా లేదా అంతకంటే మెరుగైన పునరావాస, పునఃనిర్మాణ ప్యాకేజీని కేంద్రం ద్వారా అమలు చేయాలని, భూములు కోల్పోయిన రైతులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులకు ప్రత్యేక పరిహారం ఉండాలని, పోలవరం ఆపరేషనల్ రూల్ కర్వను సవరించాలని, వరదకాలంలో ప్రాజెక్టులో గరిష్ట నీటి మట్టాన్ని నిల్వ చేయకుండా రన్ ఆఫ్ ద రివర్ విధానం అమలు చేయాలని, జూలై నుండి ఆగస్టు వరకు అవసరమైన సమయంలో గేట్లు ఎత్తి వరద నీటి ప్రవాహాన్ని నిరాటంకంగా దిగువకు విడుదల చేయాలని, పోలవరం డిజైన్, స్పిల్ వే సామర్థ్యం పునఃసమీక్షించాలని, కిన్నెరసాని, ముర్రేడు వాగులపై ప్రత్యేక అధ్యయనం చేయాలని, భద్రాచలం పట్టణానికి శాశ్వత వరద రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు పినపాక నియోజకవర్గంలో కొత్త ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాలని, పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా

మిగతా 4లో



## మానవత్వాన్ని చాటిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి !

**టీ మీడియా జూన్ 3 ,ఖమ్మం రూరల్** :పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తన సొంత డబ్బులతో మరణించిన బాధిత కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సాయంలి లిఖమ్మం రూరల్ మండలంలో గల అన్ని గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం ఆధ్వర్యంలో మరణించిన బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి రూ.10,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ లిబాధిత కుటుంబ సభ్యులు ఈ ఆర్థిక సహాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి, పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కు కృతజ్ఞతలు తెలిపారు.




## జర్నలిస్టులపై ఇంటెలిజెన్స్ విచారణ

### - క్లీన్ చిట్ ఇస్తేనే గుర్తింపుకార్డు?

**టీ మీడియా జూన్ 3 ,జనగామ :** అక్రెడిటేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న జనగామ జిల్లా జర్నలిస్టులపై ఇంటెలిజెన్స్ పోలీసుల విచారణకు జిల్లా యంత్రాంగం ఆదేశించింది. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ వెబ్‌సైట్‌లో ఇప్పటివరకు జిల్లాలోని దాదా పు 360 మందికిపైగా జర్నలిస్టులు దరఖాస్తు చేసుకొని కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల జిల్లా మీడి యా అక్రెడిటేషన్ కమిటీ సమావేశంలో దరఖాస్తులను పరిశీలించి అందులో 288 మంది జర్నలిస్టుల దరఖాస్తులకు అన్ని అర్హతలు ఉన్నట్టు తేల్చి జాబితాను ఆమోదించింది.నిబంధనల ప్రకారం వీరందరికీ ప్రభుత్వ గుర్తింపుకార్డు (అక్రెడిటేషన్) అందించాల్సి ఉండగా, గతంలో ఎప్పుడూలేని విధంగా 160 మంది జర్నలిస్టులకు సంబంధించిన జాబితాను వరంగల్ స్పెషల్ బ్రాంచ్ విభాగం (ఎస్‌బీ), ఇంటెలిజెన్స్ వర్గాలకు అందించిన జిల్లా యంత్రాంగం.. జర్నలిస్టులపై విచారణకుఆదేశించడంచర్చనీయాంశమైంది. దరఖాస్తుదారుల వివరాలతో ఇంటెలిజెన్స్ విభాగం పోలీసులు జర్నలిస్టులకు ఫోన్లుచేసి వివిధ వివరాలు అని ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది.



# వెంకటరెడ్డి మృతి కాంగ్రెస్ కి తీరని లోటు

### -మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**టీ మీడియా జూన్ 3 ,హుజూర్ నగర్:** గరిడేపల్లి మండల పరిధిలోని గానుగబండ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గుర్రం వెంకట రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... గుర్రం వెంకటరెడ్డి విద్యాకమిటి చైర్మన్ గా, ఎంపీటీసీగా పనిచేశారన్నారు. గానుగబండ గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి గ్రామ,మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారని,వారి సేవలు మరువలేనివన్నారు.వెంకటరెడ్డి మృతి అత్యంత బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి,సంతాపం తెలిపారు.వారి కుటుంబానికి ఎల్లపుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# ఆక్రమణలను తొలగించండి

### - సర్వేను పరిశీలించిన సిపిఐ బృందం

### -సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**టీ మీడియా జూన్ 3 ,ఖమ్మం :** అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆక్రమణలను తొలగించకపోతే పేదలచే ప్రభుత్వ భూములు –ఆక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హవేలీ సిపిఐ కార్యాలయంలో జరిగిన హవేలీ శాఖ సమావేశం నానబాల రామకృష్ణ –అధ్యక్షతన జరిగింది. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సంపన్నుల పట్ల, కబ్జాదారుల పట్ల మేతక వైఖరిని అవలంభిస్తుందన్నారు. నిలువ నీడ లేక కాలువలపై గుడిసెలు వేసుకున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించిందని ఈ ఖాళీ చేయడానికి ఎవరు కారకులో వారే ఇప్పుడు –నాగార్జున సాగర్ కాలువ కట్టలను ఆక్రమిస్తున్నారని సురేష్ ఆరోపించారు. ప్రభుత్వం తమకు అండగా నిలబడుతుందని ఆక్రమణదారులు, కబ్జాదారులు విస్తృత ప్రచారం చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా యంత్రాంగం ఇదే రీతి అవలంభిస్తే పేదలను సమీకరించి ప్రభుత్వ భూములను –ఆక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు.



**సర్వే పరిశీలన**

ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి సిపిఐ ఫిర్యాదు మేరకు జరుగుతున్న ఆక్రమణలను సిపిఐ బృందం పరిశీలించింది. నీటిపారుదల –శాఖ, కార్పోరేషన్, రెవెన్యూ అధికారులు బుధవారం 12వ డివిజన్లో ఎన్నెస్పి కాలువ ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ అధికారులతో మాట్లాడుతూ నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయాల పక్కనే మురుగు నీటి నిల్వలు

**టీ మీడియా జూన్ 3 ,జూలూరుపాడు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామంలో పారిశుధ్య సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. గ్రామంలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం పక్కనే మురుగు నీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దేవాలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు, ఆ మార్గంలో రాకపోకలు సాగించే బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనాల్సిన పవిత్ర ప్రదేశం పక్కనే మురుగు నీరు నిల్వ ఉండటం బాధాకరమని వారు పేర్కొంటున్నారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు చంద్రుగొండ వెళ్లే రహదారి పక్కన ఉన్న ముత్యాలమ్మ తల్లి దేవాలయం ఎదుట కూడా మురుగు నీరు బీటీ రోడ్డుపైనే ప్రవహిస్తోంది. రహదారి పక్కన నిల్వైన మురుగు నీటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రహదారిపైనే మురుగు నీరు ప్రవహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించకపోవడం శోచనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్ల వెంట చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం, మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల గ్రామ పరిసరాలు అపరిశు భ్రంగా మారాయని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇలాంటి సమస్యలు నెలకొన్నప్పటికీ నిత్యం ఈ ప్రాంతంలో తిరిగే అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మురుగు నీటి నిల్వలను తొలగించి, డ్రైనేజీ వ్యవస్థ

## విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

**టీ మీడియా జూన్ 3 ,చుంచుపల్లి:** రుద్రంపూర్ మార్కెట్ ఏరియాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భారీ రావిచెట్టు బుధవారం తెల్లవారుజామున వచ్చిన గాలి దుమారానికి కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై, అలాగే సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ షెడ్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో పలు విద్యుత్ స్తంభాలు కూడా దెబ్బతినడంతో ఉదయం 4 గంటల నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అంతరాయంతో రుద్రంపూర్ మార్కెట్ ప్రాంతంతో పాటు పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండలు మండిపోతున్న వేళ ఫ్యాన్లు, కూలర్లు పనిచేయకపోవడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. మరోవైపు మార్కెట్ ఏరియాలోని వ్యాపార సముదాయాలకు విద్యుత్ లేకపోవడంతో పలువురు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేయాల్సి వచ్చింది.సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే మరమ్మతు పనులు చేపట్టి విరిగిపోయిన కొమ్మలను తొలగించారు. దెబ్బతిన్న విద్యుత్ తీగలు, స్తంభాల మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ఏఈ లక్ష్మీ నరసింహారావు, లైన్‌మెన్ కిషన్, సాంబశివరావు పంచాయతీ సిబ్బంది శ్రమించారు. భారీ చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లకు ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి చెట్ల కొమ్మలను కత్తిరించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధం

### రూ.3.15 లక్షల ఆస్తి నష్టం

**టీ మీడియా జూన్ 3 , ఎర్రుపాలెం:** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం వెంకటాపురం ఎస్సీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించి భారీ ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన కోట యేసు కుటుంబ సభ్యులతో కలిసి వేసవి కాలం కావడంతో మంగళవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉంచిన రూ.1.15 లక్షల నగదు పూర్తిగా దగ్ధమైంది. అదేవిధంగా సుమారు రూ.2 లక్షల విలువైన గృహోపకరణాలు, బట్టలు తదితర వస్తువులు మంటల్లో కాలిపోయాయి.మొత్తంగా రూ.3.15 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అనంతరం బుధవారం రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. తమకు జరిగిన నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం, అధికారులు తగిన సహాయం అందించాలని బాధిత కుటుంబం కోరింది.

## సొసైటీ భీమా చెక్కు అందజేత



**టీ మీడియా జూన్ 3 ముదిగొండ:**మండల పరిధిలోని పమ్మి గ్రామానికి చెందిన మహిళా రైతు యర్రా స్వరూప ఇటీవల అకాల మరణం చెందారు. ఆమె మృతితో ఆ కుటుంబంలో నెలకొన్న విషాదాన్ని పంచుకుంటూ, సొసైటీ సభ్యత్వం ద్వారా లభించే ప్రమాద భీమా పరిహారాన్ని అధికారులు బాధిత కుటుంబానికి అందజేశారు. పమ్మి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) చైర్మన్ తుపాకుల ఎలగొండ స్వామి ముఖ్య అతిథిగా హాజరై, మృతురాలి భర్త యర్రా సీతారామరావుకు రూ. 1 లక్ష విలువైన భీమా చెక్కును అందజేశారు.రైతు కుటుంబాలకు సొసైటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: చైర్మన్ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ తుపాకుల ఎలగొండ స్వామి మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే రైతు కుటుంబాలకు ఏదైనా ఆపద వస్తే సొసైటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సభ్యత్వం కలిగిన ప్రతి రైతుకూ భీమా సౌకర్యం కల్పించడం వల్ల ఇలాంటి కష్టకాలంలో వారి కుటుంబాలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. మరణించిన స్వరూప ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు:
ఈ చెక్కు పంపిణీ కార్యక్రమంలో సొసైటీచీఫ్ఎగ్జిక్యూటివ్ఆఫీసర్(సీఈఓ) ప్రసాద్తోపాటు సొసైటీ సిబ్బంది సభ్యులు: దీపికలక్ష్మయ్యశ్రీను జానీమియా మధురమ్మ మరియు స్థానిక రైతులు, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.



## గిరిజన కళాశాల పూర్వ విద్యార్థుల ఫోరం

### ప్రతిభ చూపిన విద్యార్థులకు ఘన సన్మానం

**టీ మీడియా జూన్ 3 , కొత్తగూడెం:** ఏజెన్సీ గిరిజన పట్టభద్రుల సంక్షేమార్థం 2000 సంవత్సరంలో భద్రాచలం ఐటీడీఏ సంస్థ నెలకొల్పిన గిరిజన విద్యా కళాశాల పూర్వ విద్యార్థులు దాదాపు అందరూ స్థిరపడ్డారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న తారాచంద్, మోహన్ రావు, శంకర్, నరేష్ బాబు, నరసింహారావు, శ్రీనివాస్ కబీర్దాస్, నరేంద్రబాబు, మోహన్ లు ఒక ఫోరంగా ఏర్పడి, కొత్తగూడెం స్థాయిలో గత పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎండి జైనాబ్ (556/600) పాత కొత్తగూడెం, ఎం.ప్రత్యూష (545/600) ఆనందఖని, పి. శ్రీలేఖ (537/600) ఆనంద ఖని విద్యార్థినులను, తల్లిదండ్రులను కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, డిటి అంజద్ పాషా, శంకర్ రావులు పూర్వ ప్రిన్సిపాల్ గిరిజన బిఈడి కళాశాల డాక్టర్ ప్రభుదయాల్ ఆధ్వర్యంలో బుధవారం రోజున నగదు పురస్కారంతో పాటు, ఫైల్స్, రాత పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు అందించి, ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను కొనసాగించాలని కోరారు.అనంతరం పలువురు అధికారులు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అనేక విద్యార్థులకు ప్రేరణగ నిలిచే ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. రెట్టింపు ఉత్సాహంతో విద్యా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. పూర్వ రాష్ట్ర పరిధిలో గల అన్ని ఐటిడిఏ ప్రాంతాల్లో పనిచేస్తున్న శిష్యులకు ఇదే తరహాలో విద్యార్థులను ప్రోత్సహించేలా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించేలా, ప్రోత్సాహిస్తునట్లు పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుదయాల్ వెల్లడించారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా నిర్వహించడం పట్ల పలువురు గిరిజన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ మిత్రబృందం పాల్గొన్నారు.



## ముంపు ప్రాంతాల్లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందం పర్యటన

**టీ మీడియా జూన్ 3 ,బూర్గంపహాడ్:** పోలవరం ప్రాజెక్టు పూర్తయితే బ్యాక్ వాటర్‌తో తెలంగాణలోని గోదావరి తీరప్రాంతాల్లో ప్రభావం కలిగించే పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందం (పీపీఏ) బుధవారం మండలంలో పర్యటించింది. తొలుత ఐటీసీ గెస్ట్‌హౌజ్ చేరుకున్న బృందం స్థానికంగా ఉన్న కేంద్ర జలసంఘం, నీటి పారుదల విభాగం అధికారులతో సమీక్షించి అనంతరం బూర్గంపహాడ్ మండలంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని కొల్లు ప్రాంతంతో పాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాల్లో రెండు ప్రాంతాల్లో పర్యటించి ముంపునకు గల కారణాలపై అధ్యయనం చేశారు. అదేవిధంగా అశ్వాపురంలోని హెవీ వాటర్ ప్లాంట్‌ను బృందం సందర్శించి అక్కడ వరద ప్రవాభం ఏ మేరకు ఉందో అక్కడి వారిని అడిగి తెలుసుకుని అధ్యయనం చేశారు.పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రభావం ఎక్కడెక్కడ ఉంటుందో ఆ ప్రాంతాల్లో పర్యటిస్తూ అధ్యయనం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ తో ప్రధానంగా బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలకు సమస్య ఉందని, అటు భద్రాచలం, దుమ్ముగూడెం ప్రాంతాల్లో బ్యాక్ వాటర్ ప్రభావం ఎక్కువగా ఉండి ముంపునకు గురయ్యే ప్రాంతాలు ఎక్కువగా ఉన్నట్లు బృందం గుర్తించినట్లు తెలుస్తోంది. పరిశీలన చేసిన బృందంలో పీపీఏ సీఈఓ సంజీవ్ వోహ్రా, ఎంఎస్ రఘురాం, సీఈ రమేశ్, డైరెక్టర్ సతీష్, డిప్యూటీ డైరెక్టర్లు ప్రవీణ్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఎస్ఈ సుబ్రమణ్యప్రసాద్, ఈఈలు వెంకటేశ్వరరావు, మమ్మద్ జాని, డీఈలు శ్రీనివాస్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థలను తాకట్టు పెట్టే కుట్రను అడ్డుకోవాలి

### స్మార్ట్ మీటర్లతో ఉచిత విద్యుత్‌కు ముప్పు

### మొక్కజొన్న రైతులకు వెంటనే బకాయిలు చెల్లించాలి

### రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



**టీ మీడియా,జూన్03,సింగరేణి(కారేపల్లి):**రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకునే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆరోపించారు.కారేపల్లి మండలం ఎర్రబోడులో రైతు సంఘం సమావేశం మండల అధ్యక్షుడు ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లులను రాష్ట్రాలపై రుద్దేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.దేశవ్యాప్తంగా రైతాంగం చేసిన పోరాటాల వల్ల గతంలో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయని, ఇప్పుడు మరో రూపంలో వాటిని అమలు చేయాలని చూస్తోందన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే నార్తర్న్, సౌతర్న్ విద్యుత్ పంపిణీ సంస్థలు ఉండగా,"రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ" పేరుతో కొత్త సంస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అసలు ఉద్దేశం ప్రస్తుతం ఉన్న విద్యుత్ సంస్థలను లాభదాయకంగా చూపించి వాటిని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకోవడమేనని ఆరోపించారు.రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోందని, ప్రతి స్మార్ట్ మీటర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.ఇండ్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల వద్ద కూడా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే యోచన ఉందని, ఇది విద్యుత్ రంగ ప్రయివేటీకరణలో భాగమేనని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా భవిష్యత్తులో ఉచిత విద్యుత్ పథకానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మొక్కజొన్న రైతులు పంట విక్రయాల సమయంలో బస్తాలు, లారీలు, గోదాముల కొరతతో పాటు అకాల వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.రైతులు విక్రయించిన మొక్కజొన్నకు సంబంధించిన బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి అవసరాలు పెరిగాయని, మొక్కజొన్న బకాయిలతో పాటు రైతు భరోసా నిధులను కూడా తక్షణమే విడుదల చేయాలని కోరారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే పోరాటాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు తుమ్మోజు రామమూర్తి, పాపినేని నాగేశ్వరరావు, భాగం వెంకటప్పారావు, ఎస్కే సైదులు, తమ్మినేని ముత్తయ్య, వల్లభినేని మురళి, పాసిన్ని నాగేశ్వరరావు, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో

## నేడు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పర్యటన

### గుట్టకింద గుంపులో గోదాములు, సిసి రోడ్లకు శంకుస్థాపన

### పొలంపల్లి--కోటిలింగాల బీటీ రోడ్డు పనులకు శ్రీకారం



**టీ మీడియా,జూన్03,సింగరేణి(కారేపల్లి**వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నేడు సింగరేణి మండలంలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా మండల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు.ఉదయం 10 గంటలకు గుట్టకింద గుంపు గ్రామంలో 15,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించనున్న గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.అలాగే రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు.అనంతరం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు.భోజన విరామం అనంతరం సాయంత్రం 4 గంటలకు పొలంపల్లి--కోటిలింగాల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు.ఈ కార్యక్రమాలకు మండలంలోని అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,సర్పంచులు,ఉపసర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.



## నకిలీ విత్తనాల ఆరోపణలు అవాస్తవం

**టీ మీడియా, జూన్ 3,దమ్మపేట:**దమ్మపేట మండలం మద్దులగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రైతులు ధారా ప్రసాద్ చేసిన నకిలీ విత్తనాల ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. శ్రీకర్ మేజ్ సీడ్ ఆర్గనైజర్ బొబత్తుల శివ నాగరాజుకు మద్దతుగా నిలిచిన రైతులు, తమకు అందించిన శ్రీకర్-161 విత్తనాల్లో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. 350 ఎకరాల్లో 29 మంది రైతులు ఈ విత్తనాలు సాగు చేయగా, ఒక్క ధారా ప్రసాద్ మినహా మిగిలిన వారందరికీ మంచి దిగుబడులు వచ్చాయని తెలిపారు.నకిలీ ఆరోపణలతో రైతులను, ఆర్గనైజర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.



## ఆటో డ్రైవర్లకు ఉచితంగా రూ.10 లక్షల పోస్టాఫీస్ బీమా

**టీ మీడియా, జూన్ 3, ఖమ్మం** :ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ దంసలపురం సీతారాంపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లందరికీ "లైఫ్ టైమ్ ఫ్రెండ్స్" టీం తుమ్మ అప్పిరెడ్డి , అమర్లపూడి ప్రకాష్ ,బాలా షౌరి, చెరుకూరి కోటేశ్వరరావు తంబీ డెకరేషన్ ఆధ్వర్యంలో భారత తపాలా శాఖ ద్వారా అందిస్తున్న రూ.10 లక్షల విలువ గల ప్రమాద బీమా పాలసీలను అందించే కార్యక్రమం చేస్తున్న విషయం తెలిసిన వెంటనే 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు ,21వడివిజన్ మాజీ కార్పొరేటర్ ఆళ్ళ నిరీష అంజిరెడ్డి స్వతహాగా పాల్గొని ఎంత ఖర్చు అయినా పర్వాలేదు మేము కూడా ఆర్థిక సహాయం చేస్తామని ఐదు లక్షలు కాదు మన వాళ్ల అందరికీ ఆటో డ్రైవర్లకు పది లక్షల బీమా పాలసీలను చేయాలని ప్రోత్సాహం అందించారు. ఖమ్మం నగరంలోని అందరూ ఆటో డ్రైవర్లు కూడా ఈ ఇన్సూరెన్సు చేయించుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీ వి. వీరభద్రస్వామి మాట్లాడుతూ, పోస్టాఫీస్ ప్రమాద బీమా పథకం ద్వారా ప్రమాదాల్లో మరణించిన అనేక మంది పాలసీదారుల కుటుంబాలకు రూ.10 లక్షల 15 లక్షల, చొప్పున బీమా మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.549 ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.ఈ బీమా పథకంలో ప్రమాద మరణంతో పాటు శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం,ప్రమాదాల వల్ల కలిగే ఆసుపత్రి ఖర్చులకు రూ.1 లక్ష వరకు ఆర్థిక సహాయం లభిస్తుందని వివరించారు. 18 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని, ఆసక్తి గల వారు సమీప పోస్టాఫీస్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు, లైఫ్ టైమ్ ఫ్రెండ్స్ టీం సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు ఆటో యూనియన్ నాయకులు పోతగాని రమణ కుమార్ పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల

కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాక్‌వాటర్‌తో భద్రాచలం, పినపాకలకు ముప్పు

నియోజకవర్గంలోని బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలు తీర మండలాలు కావడంతో కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.గ్రామాల్లో వ్యవసాయ భూములు, ప్రజల ఆస్తుల రక్షణ కోసం కొత్తగా రక్షణ గోడలు పోలవరం ప్రాజెక్టు వ్యయంతో నిర్మించాలని, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ కు ప్రత్యేక భద్రత కల్పించాలని, భద్రాచలం డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, గోదావరిలో భారీస్థాయిలో డీసిల్టింగ్ పనులు చేపట్టడంతో పాటు తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అమలు అమలుచేయవద్దనే డిమాండ్లతో రక్షణ చర్యలన్నింటినీ పోలవరం ప్రాజెక్టు కాంపోనెంట్లలో చేర్చాలని పీపీఏకు విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, కోడి అమరేందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నాయకులు వెన్న అశోక్ కుమార్, కంచుగట్ల వీరభద్రం, గొర్రెముచ్చు వెంకటరమణ, శివారపు డాక్టర్బాబు, బూర్గంపహాడ్ మండల నాయకులు కర్రి నాగేశ్వరరావు, భూక్యా కృష్ణ, బొబ్బిలి, దాసు, గోపికృష్ణ, రామకృష్ణ, సత్యనారాయణ ఉన్నారు.

## ఎంపీఓగా హనుమంతరావు బాధ్యతలు స్వీకరణ.



**టీ మీడియా, జూన్ 3 ,కూసుమంచి**కూసుమంచి మండల పరిషత్ అధికారిగా రేమల్లె హనుమంతరావు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రం ములుగు లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ప్రభుత్వ సాధారణ బదిలీ లో భాగంగా కూసుమంచి కి వచ్చారు. ఇప్పటివరకు డిప్యూటేషన్ పై కూసుమంచి ఎం పి ఓ గా పనిచేసిన రాజారావు తన రెగ్యులర్ పోస్ట్ ఖమ్మం రూరల్ మండలం కి వెళ్లారు. నూతన ఎంపీ ఓ గా బాధ్యతలు స్వీకరించిన హనుమంతరావు మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రధానంగా త్రాగునీరు, పారిశుద్ధ్యం కి ప్రాధాన్యత నిస్తూ, అన్ని రకాల గ్రామాభివృద్ధి కి కృషి చేస్తానని ఎంపీ ఓ హనుమంతరావు “టీ మీడియా” తో చెప్పారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

**టీ మీడియా, జూన్ 3 అశ్వారావుపేట**

అశ్వారావుపేట సబ్‌డివిజన్ పరిధిలోని దమ్మపేట, అశ్వారావుపేట మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) సదస్సును గురువారం అశ్వారావుపేట 220/132 కేవీ సబ్ స్టేషన్ లో ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ ఏడీఈ బి.వెంకటరత్నం బుధవారం ప్రకటించారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ వేణుగోపాల చారి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా, బిల్లింగ్, కొత్త కనెక్షన్లు, ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు తమ ఫిర్యాదులు, వినతులను నేరుగా సమర్పించవచ్చని తెలిపారు.

# హామీలు నెరవేర్చకుంటే గత పాలకులకు పట్టిన గతే

**పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరగాలి**

**సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి**

**నున్నా నాగేశ్వరరావు**

**టీ మీడియా, జూన్03, సింగరేణి (కారేపల్లి)**



అధికారంలోకి రావటానికి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటి అమలు కొర్రీలు పెడుతూ ప్రజల అగ్రహానికి గురవుతుందని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు.కారేపల్లి మండలం ఎర్రబోడులో బుధవారం వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సమావేశం తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు కూలీలకు ఇస్తానన్నా రూ.2500 ఊసేలేదన్నారు.రైతులకు రుణమాఫీ సగంలో అపేశారని,రైతుకు పెట్టుబడి భరోసా అందటంలేదన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే గత పాలకులకు పట్టిన గతే పడుతుందన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలన్నారు.రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇండ్లు దక్కాలన్నారు.లబ్ధిదారులను ఎల్ 1,ఎల్2,ఎల్3 గా విభజించిన ప్రభుత్వం మొదటి విడుతలో ఎల్ 1 జాబితాలో వారి పూర్తి అందలేదని,రెండో విడుతలో విడుదల చేసిన ఇండ్లలో సైతం ఎల్1 జాబితా కే సరిపోతున్నాయన్నారు.మొదటి విడుతలో వైరా నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు కాగా, రెండో విడుతలో 2500 మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎల్2, ఎల్3 జాబితాలోని అర్హులకు ఏనాటికి ఇండ్లు అందుతాయనే అర్ధంకాని పరిస్థితి ఉందన్నారు.జిల్లాలో అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయని విమర్శించారు.అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నా అవి పూర్తికావటానికి దీర్ఘకాలం పడుతున్నాయన్నారు.అభివృద్ధి పనులు మంజూరు చేయటంతోనే సరిపుచ్చుకోకుండా నిధులు వెంటనే విడుదల చేయటం ద్వారా అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు.సింగరేణి మండలం గుండా వెళ్తున్న సీతారామప్రాజెక్టు నీళ్లు తో సింగరేణి మండల ప్రజలకు ఉపయోగపడక పోవటం విచారకరమన్నారు.సీతారామద్వారా సింగరేణికి నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు.ఈసమావేశంలో వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం,కార్యదర్శివర్గ సభ్యులు కొండబోయిన నాగేశ్వరావు, దుగ్గి కృష్ణ, సుంకర సుధాకర్, దొంతబోయిన నాగేశ్వరరావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు దారి మళ్లించేందుకే

# మత విభజన రాజకీయాలు

**- మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలి**

**- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, పోతినేని సుదర్శన్ పిలుపు**

**టీ మీడియా, జూన్ 3 అశ్వారావుపేట**



ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే పాలకులు మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, మతోన్మాద – కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను విస్తృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు.
స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో మూడు రోజులపాటు జరుగుతున్న రాజకీయ శిక్షణా తరగతులలో భాగంగా “మతోన్మాద – కార్పొరేట్ రాజకీయాలు” అంశంపై వారు బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత విభజన రాజకీయాలు పెరిగి ప్రజలను ఉన్మాదం వైపు నడిపిస్తున్నాయని విమర్శించారు. ప్రజల రోజువారీ సమస్యలను పక్కనబెట్టి మతాన్ని సెంటిమెంట్‌గా ఉపయోగించి విద్వేష రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.
పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్న పాలకులు, దేశం కోసం భరించాలని నీతిసూక్తులు చెప్పడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాల్సిన ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రవచనాలు చెప్పడం సరైన విధానం కాదని విమర్శించారు.
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధాల ప్రభావంతో ఇంధన ధరలు పెరుగుతున్నప్పటికీ, అమెరికాతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం యుద్ధం ఆపాలని కూడా కోరలేదని అన్నారు. అమెరికా ప్రయోజనాల కోసం భారత సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు.
భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందాల ద్వారా అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, మొక్కజొన్న, చికెన్ తదితర వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు మార్గం సుగమం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల భారత రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
దేశంలో నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తి, సామాజిక న్యాయం వంటి విలువలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని కాపాడేందుకు ప్రజలు, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.
భారత రాజ్యాంగాన్ని, లౌకిక విలువలను, మత సామరస్యాన్ని పరిరక్షించడంలో కమ్యూనిస్టులు మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలపై పడుతున్న భారాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యల ఆధారంగా ఉద్యమాలను నిర్మించి, ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజా పోరాటాల ద్వారానే మత విభజన రాజకీయాలకు చెక్ పెట్టగలమని పేర్కొన్నారు.
ముందుగా శిక్షణ తరగతుల ప్రారంభ సూచికగా పార్టీ పతాకాన్ని అశ్వారావుపేట ప్రాంత సీనియర్ నాయకులు, పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య ఎగురవేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, ఎం.బి. నర్సారెడ్డి, కే. బ్రహ్మచారి, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, దొడ్డ రవి, ఎస్.ఏ. నబి, చిరంజీవి నాయుడు, పిట్టల అర్జున్, మోరంపూడి శ్రీనివాస్, ముదిగొండ రాంబాబు, కొండబోయిన వెంకటేశ్వర్లు, వీర్ల రమేష్, గద్దం స్వామి, యాసా నరేష్, భూక్యా రమేష్, వాంకుడోత్ కోబాల్, సోడే ప్రసాద్, గద్దల శ్రీను, నిమ్మల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.